క్లుప్తంగా

కృత్రిమ పరికరాల వినియోగంపై శిక్షణ



కృత్రిమ పరికరాల వినియోగంపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: వాకలపూడి ఉమా మనో వికాస కేంద్రంలో దివ్యాంగులకు కృత్రిమ పరికరాల వినియోగంపై జాయినింగ్ హెచ్ చారిటి సంస్థ, డాక్టరు ఎంవీఆర్ ఆరోగ్య, గొల్లప్రోలు విద్యా ట్రస్ట్ సహకారంతో శనివారం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో యూకే నుంచి వచ్చిన డాక్టర్ పి.రఘునాథ, పునరావాస వైద్య నిపుణుడు డాక్టరు సునీల్‌కుమార్ పాల్గొని 36 మందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమా మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎస్‌పీ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించండి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించిన టీపీఆర్వో శైలజ

కాకినాడ: డ్వాక్రా ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి ఆదరించాలని టీపీఆర్వో కె.శైలజ కోరారు. స్థానిక ఆనందభారతి మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన అనేక ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల వేర్వేరు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆస్తులు అందజేసేందుకు కృషి



క్రెడాయ్ కాకినాడ చాప్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: ప్రజలకు నాణ్యమైన ఆస్తులను అందించేందుకు క్రెడాయ్ సభ్యులు కృషి చేస్తున్నారని ఆ సంస్థ జాతీయ మాజీ అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి రామ్‌రెడ్డి అన్నారు. స్థానిక డీమార్ట్ సమీపంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన క్రెడాయ్ కాకినాడ చాప్టర్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. క్రెడాయ్ రాష్ట్ర వ్యాప్తంగా 20 శాఖలు కలిగి ఉందన్నారు. దీనిలో 6 శాఖలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. కాకినాడ శాఖకు సొంత భవనం రావడంతో ఈ సంఖ్య ఏడుకు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ నగర అధ్యక్షుడు కమ్ముల విజయకృష్ణ, కార్యదర్శి టీవీ రమణారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఉత్తమ సేవా పురస్కారాలు



ఎస్సై సునీత



ఎంఈఓ శైలజ

కరప: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఇద్దరు అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. స్థానిక ఎస్సై తోట సునీత, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగంలో మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఆదివారం కాకినాడ పెరేడ్‌లో జరిగే వేడుకల్లో కలెక్టర్ షణ్మోహన్ తదితర ప్రముఖుల నుంచి పురస్కారాలు అందుకోనున్నట్టు వారు తెలిపారు.

భవనంపై నుంచి పడిన వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కాకినాడ రూరల్ ఇంద్రపాలెం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి నాగేంద్ర (33) భవనంపై నుంచి కిందికి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ నెల 21వ తేదీన కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓపీ నం.19లో శనివారం వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభమైంది. ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. సోమ, బుధ వారాల్లో ఈ విభాగం సేవలు అందుబాటులో ఉంటాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. వివిధ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లపై తగిన సూచనలు సలహాలు ఈ క్లినిక్‌లో అందిస్తామని అన్నారు.



కరప హైస్కూలులో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ



నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ

ఓటు విలువ గుర్తించండి

- జేసీ రాహుల్‌మీనా
- ఓటరు దినోత్సవ ర్యాలీ

కాకినాడ: ప్రజా స్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరు ఓటు విలువ గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జెడ్పీ సెంటర్ నుంచి స్మార్ట్ సిటీ కార్యాలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ, అర్బన్ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ ర్యాలీలో కమిషనర్ భావన, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. ఐదుగురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న 8 మంది యువ ఓటర్లకు జేసీ రాహుల్ మీనా, కమిషనర్ భావన, జేఎన్‌టీయూకే వీసీ ఓటర్ కార్డులను అందజేశారు. సాధారణ ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏఈఆర్వోలు, బీఎల్వోలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కమిషనర్ భావన మాట్లాడుతూ భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతో ప్రతిష్టవంతంగా ఉందన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ప్రజాప్రతినిధులను ఓటు ద్వారానే ఎంపిక చేసుకుంటామని, అందువల్ల ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జేఎన్‌టీయూకే వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ రాహుల్ మీనా, కమిషనర్ భావన

కరపలో..

కరప: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ఓటుపై చైతన్యం కల్పించారు. వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులతో ఆయన ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఇద్దరు సీనియర్ ఓటర్లను సత్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ పవన్‌కుమార్, వీఆర్వోలు పీఎంపీ శర్మ, వీవీ రమణ, పీడీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో..

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ కే.మురళీకృష్ణ ఓటు ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదుతో పాటు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునే యువతపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి పలు పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, రమణాజీ, కిరణ్మయి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

రూరల్ మండలంలో..

కాకినాడ రూరల్: మండలంలోని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎస్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. జోసఫ్ స్టీఫెన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలకుమారి, అధ్యాపకులు పాల్గొని, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో మోహన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో, అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాలను నిర్వహించారు.

సైన్స్ ల్యాబ్‌ల ప్రారంభం



కోరమాండల్ సీఎస్ఆర్ నిధులతో అందుబాటులోకి వచ్చిన సైన్స్ ల్యాబ్‌లు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ప్లస్ (జూనియర్ కళాశాల)లో కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్‌లను శనివారం యూనిట్ హెడ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ పిల్లి రమేష్ మాట్లాడుతూ కోరమాండల్ సంస్థ సహకారంతో విద్యార్థులకు మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనిట్ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం కలిగించేలా అధునాతనంగా సైన్స్ లాబరేటరీలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో జువాలజీ లెక్చరర్ కందుకూరి పాల్‌రాజు, కోరమాండల్ సీఎస్ఆర్ మేనేజరు వంశీకృష్ణ, యశోదా కృష్ణ, సత్యవోలు శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యండమూరులో పశు ఆరోగ్య శిబిరం

కరప: పశువైద్యాధికారుల సలహాలు పాటిస్తే పాడి పశువుల ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సర్పంచ్ మార్నెళ్ల శివ అన్నారు. మండలం యండమూరులో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా 170 మంది రైతులు శిబిరానికి పశువులు, మేకలు, గొర్రెలను తోలుకుని రాగా మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు వెటర్నరీ అసిస్టెంట్ సలీమ్, గోపాలమిత్రలతో కల్సి పరీక్షలు నిర్వహించి, 26 ఆవులు, 36 పాడిగేదెలకు జలగ నివారణ, 280 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు.

రహదారి భద్రత పాటించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ మీనా, డీటీసీ శ్రీధర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రహదారి భద్రత పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని జేసీ రాహుల్‌మీనా పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం భానుగుడి నుండి జేఎన్‌టీయూ, ఐటీఐ, నాగమల్లితోట జంక్షన్, బోట్‌క్లబ్ మీదుగా సర్పవరం జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, రహదారి నిబంధనలు పాటించి మనతో పాటు ఇతరులకు అసౌకర్యం కలగకుండా ఉండాలన్నారు. జిల్లా రవాణా శాఖాధికారి కే.శ్రీధర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు కారులో ప్రయాణించేవారు సీట్ బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి కానీ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కానీ వాహనాలను నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ శివారెడ్డి, ఎంవీఐలు మురళీకృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కర్లింగ్' విజేతలకు అభినందనలు



విజేతలతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జమ్ము కాశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగిన జాతీయ స్థాయి ఐస్ కర్లింగ్ పోటీలలో విజేతలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ అభినందించారు. శనివారం కాకినాడలోని డీఎస్ఏ కార్యాలయంలో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్‌ను క్రీడాకారులు మర్యాద పూర్వకంగా కలిశారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఎస్.శేషురెడ్డి, బి.నాగేంద్రనాథ్ ఠాగూర్, కె.షణ్ముఖ్, చైతన్య, హర్ష, బి.శ్రీదేదీప్య, పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కర్లింగ్ సంఘ అధ్యక్షుడు బి.తేజశ్రీ, కార్యదర్శి ఎస్‌హెచ్ఎన్‌వీ హరికృష్ణ, కోచ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గాన సభల్లో భాగంగా స్థానిక సూర్యకళా మందిరంలో శనివారం రాత్రి కల్లూరి శ్రీనివాస్ గాత్ర కచేరీ నగర ప్రజలను ఎంతగానో అలరించింది. గాత్రంతో పాటు ఆయనే స్వయంగా మృదంగం వాయిస్తూ పాడడంతో నగర ప్రజలు ఆశ్చర్యంలో మునిగిపోయారు. వాగదీశ్వరి రాగంలో పరమాత్ముడు, సింధుభైరవి రాగంలో కృష్ణదేవం కీర్తనలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు. తొలుత ఇటీవల మరణించిన తబలా విద్యాంసులు జాకిర్ హుస్సేన్ చిత్రపటానికి నివాళులు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి రామకృష్ణ, ఎంజీవీ కృష్ణంరాజు, సీఎస్ జ్యోతి, నల్లమిల్లి మణిబాబు, వక్కలంక రామకృష్ణ, గట్టి శ్రీకృష్ణ దేవరాయలు, చావలి సూర్యకుమారి పాల్గొన్నారు.



మృదంగం వాయిస్తూ గాత్ర కచేరీ చేస్తున్న శ్రీనివాస్

పునరుత్పాదక ఇంధన సాంకేతికత అవసరం

బాలాజీచెరువు: వేగంగా అభివృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన సాంకేతికతలపై అవగాహన పెంచుకోవాలలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.మోహనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల నుంచి 25 వరకూ నిర్వహించిన ఎమర్జింగ్ టెక్నాలజీ ఇన్ ఆప్టిమైజింగ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్ విత్ స్మార్ట్ మెటరీయల్ సొల్యూషన్స్‌పై నిర్వహించిన ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహనరావు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టి సారించడంతో పాటు పునరుత్పాదకత ఆప్టిమైజ్ చేసేందుకు ఈ ప్రోగ్రాం దోహదపడుతుందన్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్, మహారాష్ట్రలకు చెందిన 138 అధ్యాపకులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వీవీ సుబ్బారావు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రామ్మోహనరావు, కో–ఆర్డినేటర్ సుబ్బారావు

'ఆర్‌ఎంసీ గ్లోబల్ జర్నల్' ఆవిష్కరణ



'ఆర్‌ఎంసీ గ్లోబల్ జర్నల్' సంచిక ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

కాకినాడ క్రైం: వైద్య, విజ్ఞాన పరిశోధనాంశాల సమాహార సమాచార మాలిక ఆర్‌ఎంసీ గ్లోబల్ జర్నల్ తొలి సంచిక శనివారం విడుదలైంది. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ) డిజిటల్ లైబ్రరీలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ ఎన్‌టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం విశిష్ట అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీపీఆర్ మేన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రిసక్సియేషన్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు తొలి సంచికను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఆర్‌ఎంసీ గ్లోబల్ జర్నల్ ఆవిష్కరణతో కళాశాల ఖ్యాతి విశ్వవ్యాప్తం అయిందన్నారు. ప్రత్యేక అతిథులు డాక్టర్ లోకేష్ ఈదర, డాక్టర్ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు నిర్వహించబోయే పరిశోధన అంశాలకు ఆర్‌ఎంసీ గ్లోబల్ జర్నల్ ప్రపంచ వేదిక అన్నారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞాన ఉన్నతికి ఈ జర్నల్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అసిస్టెంట్ ఎడిటర్ హోదాలో సర్జరీ నిపుణురాలు డాక్టర్ కె.శైలజ తొలి సంచికను విశేష రీతిలో తీర్చిదిద్దడంలో కీలకంగా వ్యవహరించారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి హాజరయ్యారు. సంచిక అసోసియేట్ ఎడిటర్లు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ దేవీమాధవి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ శశి, డాక్టర్ యశోద, డాక్టర్ శైలజారాణి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ మైథిలి, డాక్టర్ రజనీ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కరప: మంచు వల్ల ఎదురుగా ఉన్న లారీ కనపబడక ఢీ కొన్న ఆటోలోని ఇరువురికి తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెం గ్రామానికి చెందిన గొర్రుముచ్చు ముసలయ్య ఈ నెల 23న తన ఆటోలో అదే గ్రామానికి చెందిన బూరమ్మను, ఆమె కుటుంబ సభ్యులను కాకినాడ రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లాడు. కుటుంబసభ్యులను స్టేషన్‌వద్ద దింపి, బూరమ్మను తీసుకుని వస్తుండగా కరప మండలం గొర్రిపూడి, కొంగోడు గ్రామాల మధ్య రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీ మంచు వల్ల కనబడక వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముసలయ్య, బూరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ అపహరణ

రోడ్డు పక్కన నిలిపిన మోటారు సైకిల్ అపహరణకు గురైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అరట్లకట్ట గ్రామానికి చెందిన యరమాటి జాన్‌బాబు ఈనెల పదో తేదీన రాత్రి 7 గంటల సమయంలో పొలంలో నీరుకట్టుకు మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. రోడ్డుపక్క పార్కింగ్ చేసి పని పూర్తిచేసి తిరిగి వచ్చేసరికి తన వాహనం కనబడలేదు. అప్పటి నుంచి పరిసర ప్రాంతాల్లో గాలించినా మోటార్‌సైకిల్ కనబడక పోవడంతో జాన్‌బాబు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. హెచ్‌సీ ఎ.మునఫ్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షన్ టెన్షన్!

- కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో?
- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వైబ్‌సైట్
- సచివాలయాలకు నిత్యం ప్రదక్షిణ చేస్తున్న ప్రజలు

కాకినాడ సిటీ: కూటమి ప్రభుత్వం కొలువు దీరి నెలలు గడిచిపోతున్నాయి. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదు. గతేడాది అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంత వరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు, సరికదా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల్లోని కరప, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్ మండలాల్లో అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

తప్పని ఎదురు చూపు

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడంలేదు. దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజు పదుల సంఖ్యలో లబ్ధిదారులు నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం వెబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపుగా పింఛన్ల కోసం అర్హులైన వారు 2,400 మంది వరకు ఉండగా, సిటీ నియోజకవర్గంలో ఈ సంఖ్య 4 వేలకు పైబడి ఉన్నట్లు నాయకులు చెబుతున్నారు.

50 ఏళ్లకే పింఛన్ గాలికేనా?

సార్వత్రిక ఎన్నికలలో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పిన హామీ గాలికి వదిలేశారని బీసీ వర్గానికి చెందిన వారు ప్రశ్నిస్తున్నారు. బీసీలకు సమన్యాయం చేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని అడుగుతున్నారు. బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వారు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందించేవారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటికి వచ్చి పింఛను అందజేస్తున్న వలంటీర్లు

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల ముందు చెప్పిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలయినా హామీలు నెరవేర్చలేదు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటి వరకు వెబ్‌సైట్ ఓపెన్‌కాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే వలంటీర్లే ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తు చేయించేవారు.

కోనాడి దుర్గాప్రసాద్,
వైఎస్సార్‌సీపీ నాయకులు, కాకినాడ

బీసీలకు పింఛన్లు ఇవ్వాలి



ఎన్నికల హామీలలో భాగంగా 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్ ఇస్తామన్న చంద్రబాబు ఇంత వరకు అమలు చేయలేదు. వెంటనే ఎన్నికల హామీలను నెరవేర్చాలి. అలాగే బీసీలకు చట్ట భద్రత కల్పించాలి.

మేడిశెట్టి సత్తిబాబు,
బీసీ నాయకులు, కాకినాడ

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002